క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 75, వంకాయ 35, బెండ 40, పచ్చి మిర్చి 75, కాకర 45, బీర 45, క్యాబేజి 17, ఫ్రెంచి బీన్స్ 75–105, క్యారెట్ 45, దొండ 26–32, చిక్కుడు 85, గోకర 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 70, ఆలు 20, దోస 16, సొర 13, పొట్ల 23, ఉల్లిగడ్డ 18, చామగడ్డ 35 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

తొలి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



ఆర్‌కేపురం అష్టలక్ష్మి ఆలయంలోని శ్రీమన్నారాయణుడి విగ్రహం

దిల్‌సుఖ్‌నగర్: భక్తులు ఉపవాస దీక్షలతో, భక్తి ప్రపత్తులతో జరుపుకొనే తొలి ఏకాదశి పర్వదినానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మలక్‌పేట్ జోన్ పరిధిలో ఏకాదశి పర్వదినాన్ని భక్తిప్రపత్తులతో జరుపుకొనేందుకు ఆలయాలను సర్వాంగ సుందరంగా సిద్ధం చేశారు. దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌గనగర్, సైదాబాద్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, అక్బర్‌బాగ్, మాదన్నపేట తదితర ప్రాంతాలలో ఉదయం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ప్రధాన ఆలయాలలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైష్ణవ దేవాలయాలతో పాటు శివాలయాలను పూలమాలలు, విద్యుత్ దీపాలలతో అందంగా ముస్తాబు చేశారు.

రిక్వెస్ట్ బస్ స్టాప్‌ల ప్రారంభం

వనస్థలిపురం: వనస్థలిపురం డబుల్ రోడ్డులో ఓ వైపు ప్రశాంత్‌నగర్, మరో వైపు వనస్థలి హిల్స్ కాలనీల ప్రజల సౌకర్యం కోసం రెండు వైపులా టీఎస్ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రశాంత్‌నగర్, వనస్థలి హిల్స్ కాలనీల రిక్వెస్ట్ బస్‌స్టాప్‌లను ఆయన ప్రారంభించారు. ప్రశాంత్‌నగర్ కాలనీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలాజీ నాథ్, వనస్థలిహిల్స్ అధ్యక్షుడు మల్‌రెడ్డి యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్, నాయకులు సంరెడ్డి భుజంగరెడ్డి, బూడిద యుగంధర్‌రెడ్డి, ప్రసాద్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వనస్థలిహిల్స్ బస్‌స్టాప్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

బక్రీద్‌కు సర్వం సిద్ధం



ప్రార్థనలకు సిద్ధమైన మాదన్నపేట్ ఈద్గా

త్యాగానికి ప్రతీక బక్రీద్. బక్రీదు ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలు ముస్తాబయ్యాయి. మలక్‌పేట్ జోన్ పరిధిలో అంతటా బక్రీదు సందడి మొదలైంది. ఎంతగానో ఆరాధించే అల్లా కోసం ప్రాణ త్యాగానికి సైతం వెనుకాడని నాటి ప్రవక్త ఇబ్రహీం, ఇస్మాయిల్‌ల త్యాగ నిరతిని బక్రీద్ గుర్తు చేస్తుంది.

- కిటకిటలాడుతున్న దుకాణాలు
- జోరుగా గొర్రెలు, పొట్టేళ్ల విక్రయాలు

దిల్‌సుఖ్‌నగర్: బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల కోసం మలకపేట్ జోన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, మాదన్నపేట్, సైదాబాద్, అక్బర్‌బాగ్, అజంపుర, ఓల్డ్‌మలక్‌పేట్, చాదర్‌ఘాట్, ముసారంబాగ్ తదితర ప్రాంతాలలోని మసీదులు, ఈద్గాలు ముస్తాబయ్యాయి. బక్రీద్‌ను పురస్కరించుకొని మార్కెట్లలో పండగ సందడి నెలకొంది. పండగను పురస్కరించుకొని పిల్లలు, మహిళలు ఎంతో ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో కలసి దుస్తులు, గాజులు, కాస్మోటిక్స్ కొంటున్నారు. పండగ కోసం బ్యాంగిల్ స్టోర్స్, రెడీమెడ్ దుస్తుల షాపులలో అమ్మకాలు జోరందుకుంటున్నాయి.

గొర్రెలు, పొట్టేళ్ల కొనుగోళ్లతో సందడి

గొర్రెలు, పొట్టేళ్ల క్రయ విక్రయాలతో చంచల్‌గూడ, సైదాబాద్ తదితర ప్రాంతాలు సందడిగా మారాయి. తమకు కావాల్సిన పొటేళ్లు, గొర్రెలు, మేకలను కొనుగోలు చేయడంలో ముస్లింలు మునిగిపోయారు. బక్రీద్ ప్రత్యేక వంటకాల తయారీకి కావాల్సిన పదార్థాల అమ్మకాలు ఊపందుకున్నాయి. స్వీట్ల తయారీకి వాడే బాదం, కిస్‌మిస్, ఖాజులకు మంచి డిమాండ్‌నెలకొంది. పండగను పురస్కరించుకొని 'ఖుర్బానీ' ఇవ్వడానికి గొర్రెల, మేకల జోరందుకుంది.



చంచల్‌గూడ ప్రధాన రోడ్డు పక్కన విక్రయానికి సిద్ధంగా ఉన్న గొర్రెలు

భారీగా పెరిగిన గొర్రెల ధరలు...

మలక్‌పేట్‌లోని ప్రధాన రహదారులపై అమ్మకానికి ఉంచిన మేకల, గొర్రెల బరువు, దిగుమతి చేసుకున్న ప్రాంతాలను ను బట్టి రేట్లలో భారీ తేడా ఉంది. ఒకోక గొర్రె, మేక, పొట్టేలు కనీసం రూ. 6 వేలు మొదలు కొని రూ. 30 వేల వరకు చేరుకుంది.

- సైదాబాద్, చంచల్‌గూడ, చాంద్రాయణగుట్ట, ఐఎస్‌సదన్ చౌరస్తాలకు నల్లగొండ, చిట్యాల, కల్వకుర్తి, ఆమన్‌గల్, షాద్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి జీవాల విక్రయిస్తున్నారు.
- జీవాల విక్రయాలు జోరందుకోవడంతో విక్రయదారులతో చౌరస్తాలు కిటకిటలాడుతున్నాయి.
- బక్రీదు ప్రార్థనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

హస్తినాపురం: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూనే, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా హస్తినాపురం డివిజన్ వెంకటేశ్వరకాలనీలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్‌తో కలిసి సామ రంగారెడ్డి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా తాను దేశ్‌కీనేత అంటూ ఇతర రాష్ట్రాలలో పర్యటించడం కేసీఆర్ అవివేకానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. నేతలు అమరేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, మల్లేశ్‌గౌడ్, కోట్ల శివ, సాయి కిషోర్, రాజుగౌడ్, మాధవరెడ్డి, జీవన్‌రెడ్డి, అరుణ్ సింగ్, శిరీష, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర కాలనీలో పర్యటిస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

వివాదాస్పద భూమికి నష్టపరిహారమా?



సైదాబాద్‌లోని హనుమాన్ ఆలయంలో కూల్చిన సత్రం (ఫైల్)

సైదాబాద్: రహదారి విస్తరణ కోసం సైదాబాద్‌లోని హనుమాన్ దేవాలయ భూమిని సేకరించిన అధికారులు నష్ట పరిహారం చెల్లించిన విధానం మాత్రం పలు ఆరోపణలకు తావిస్తోంది. సైదాబాద్ ప్రధాన రహదారికి ఆనుకొని 2719 గజాల స్థలంలో ఉండే పురాతన హనుమాన్ ఆలయం దేవాదాయ శాఖ ఆధీనంలో ఉంది. అయితే ఆలయ స్థలం విషయంలో ఆలయ కమిటీకి, రఘునాథ్ మిశ్రా అనే వ్యక్తికి న్యాయస్థానంలో వివాదం నడుస్తోంది. ఇదిలా ఉండగా... మంగళవారం తెల్లవారుఝామున జీహెచ్ఎంసీ అధికారులు ఆలయానికి చెందిన ప్రహరీ, దానికి ఆనుకొని ఉన్న సత్రాన్ని కూల్చివేశారు. కూల్చివేత విషయమై జీహెచ్ఎంసీ అధికారులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని ఆలయ ఈఓ జయంతి తెలిపారు. కూల్చివేతపై పలువురు భక్తులు, సభ్యులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. అయితే బుధవారం రాత్రి సైదాబాద్ పోలీసులు పీఎస్‌లో రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు, నాయకులు ఇదే విషయమై చర్చిస్తుండగా ల్యాండ్ అక్వేషన్ డిప్యూటీ కలెక్టర్ నుంచి హనుమాన్ ఆలయానికి చెందిన 101 గజాలు సేకరింపుకు రఘునాథ్‌ప్రసాద్ మిశ్రా అనే వ్యక్తికి నష్ట పరిహారంగా రూ. 70,96,584 చెల్లించినట్లు అధికారికంగా తెలిసింది. దాంతో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు అవాక్కయ్యారు. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయానికి చెందిన స్థలం, అదీ న్యాయవివాదంలో ఉన్న భూమి విషయంలో ఎలాంటి నోటీసులు, సమాచారం లేకుండా ప్రైవేట్ వ్యక్తికి ఏకమొత్తంగా నష్టపరిహారం చెల్లించడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చట్టపరంగా చర్యలు...

దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న ఆలయ స్థలం విషయంలో జరిగిన పరిణామాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాను. ఆలయ ప్రహరీ కూల్చివేత విషయమై మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఆలయ స్థలానికి నష్టపరిహారం పొందిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాము.

– జయంతి, ఆలయ ఈఓ

మూసారంబాగ్‌లో ఎమ్మెల్యే బలాల పర్యటన



ఎమ్మెల్యే బలాలకు సమస్యలు తెలియజేస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: ఎమ్మెల్యే అహ్మద్ బలాల బుధవారం మూసారంబాగ్ డివిజన్‌లో పర్యటించారు. వీరభద్రీయ సంఘం వెనుక లైన్‌లో ఉన్న కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీవరేజ్ లైన్, వాటర్ లైన్, రోడ్ల సమస్యలు కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... సమస్యలు తీర్చడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ, వాటర్స్ వర్క్స్ పనుల కోసం ప్రతిపాదనలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, విద్యుత్, శానిటేషన్ అధికారులు, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



నరేందర్

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం నూతన కార్యవర్గాన్ని మన్సూరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సంఘం అధ్యయన వేదిక అధ్యక్షుడు వెంకటనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆర్.విశ్వేశ్వరయ్య, వల్లపు సమ్మయ్య, తిపిరిశెట్టి శ్రీనివాస్, కోనేటి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడిగా ఒంటెద్దు నరేందర్, ప్రధాన కార్యదర్శిగా వెన్నెల నాగరాజు, వర్కింగ్‌ప్రసిడెంట్‌గా జల్లి యాదగిరి, కోశాధికారిగా సింగజోగి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జహంగీర్‌పాషా, సిద్దుల రవీందర్, శివరాత్రి దుర్గయ్య, జల్లి సత్యనారాయణ, బొప్పల రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వనర్స విజయ్‌కుమార్ ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు నరేందర్ తెలిపారు.

అభివృద్ధే లక్ష్యం: కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కార్పొరేటర్ మెద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో ప్రారంభించిన మట్టి రోడ్డు పనులను డీఈ దామోదర్‌రావుతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో 'కార్పొరేట్' వైద్యం

మలక్‌పేట: మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో ప్రజలకు కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అక్బర్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ అన్నారు. నల్లగొండ క్రాస్ రోడ్‌లో ఉన్న మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫాకో మిషన్ బుధవారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధునాతనమైన ఫాకో మిషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు చేరువలో ఉన్నాయన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్‌శ్యామ్, ఆర్ఎంఓ డాక్టర్ మల్లికార్జునప్ప, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునిత, ఇన్‌చార్జ్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఫాకోమిషన్ ప్రారంభిస్తున్న కార్పొరేటర్

రేపటి నుంచి ఉభయ వేదాంత పండిత సభలు

మన్సూరాబాద్: ఉభయవేదాంత పండిత సభలు ఈ నెల 30 నుంచి జూలై 1, 2వ తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ గౌరవ అధ్యక్షుడు, ఎస్వీఎస్ ట్రస్ట్ చైర్మన్ కండ్లకుంట యాదగిరిచార్యులు తెలిపారు. మన్సూరాబాద్ చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో బుధవారం ఉభయ వేదాంత పండిత సభలు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీవైష్ణవ సవా సంఘం, తెలంగాణ, ఎస్వీఎస్ ట్రస్ట్, హైదరాబాద్, సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్ట్, వరంగల్, ఉభయవేదాంత పండిత పరిషత్, భాగ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో వైష్ణవ సదనంలో ప్రప్రథమంగా ఉభయ వేదాంత పండిత సభలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. శుక్రవారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిదండి దేవనాథ్ రామానుజ జీయర్ స్వామి హాజరవుతారన్నారు. ఎస్వీఎస్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చిలుకమర్రి లక్ష్మీనాథాచార్యులు, శ్రీవైష్ణవ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి సేనాపతిమోహన్, ఉపాధ్యక్షులు ఆచార్య వేణు, కోశాధికారి బద్రీనాథ్, కార్యదర్శి రమాదేవి, ఉభయవేదాంత పండిత పరిషత్, భాగ్యనగర్‌శాఖ ప్రతినిధులు వెంకటనర్సింహాచార్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ

- ఘనంగా పీవీ నరసింహారావు జయంతి
- పార్టీలకు అతీతంగా నివాళులర్పించిన నేతలు



అల్కాపురి చౌరస్తాలో పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు దివంగత పి.వి.నరసింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం రామకృష్ణాపురం డివిజన్ అల్కాపురి చౌరస్తాలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పీవీ జయంతి ఉత్సవాల్లో దేప భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీవీ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంతరాలు, అసమానతలు లేని సమాజం ఏర్పాటు కోసం సంస్కరణలకు శ్రీకారం చుట్టిన గొప్ప మార్గదర్శకుడు నరసింహారావు అని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, తలాటి రమేష్ నేత, బోడ్డుపల్లీ మహిందర్, శివ, విజయ్, రాజు నాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో...

దివంగత పీవీ జయంతి సందర్భంగా అల్కాపురి చౌరస్తాలో పీవీ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీలు మురుకుంట్ల అరవింద్, బేర బాలకిషన్, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు గొడుగు శ్రీనివాస్, నాయకులు సాజిద్, కంచర్ల శేఖర్, సిద్ధగోని వెంకటేష్ గౌడ్, లింగస్వామి గౌడ్, జగన్ మోహన్ రెడ్డి, శ్యాం గుప్తా, మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ మలక్‌పేటలో...

చాదర్‌ఘాట్: స్వర్గీయ పీవీ నరసింహారావు ఆశయ సాధనకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పీవీ జయంతి సందర్భంగా బుధవారం ఓల్డ్‌మలక్‌పేటలో ఆయన పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు బాబు శ్రీనివాస్, రాజేందర్ యాదవ్, శ్రీకాంత్‌గౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.

నాగోలు డివిజన్ నేతల నివాళి

నాగోలు: తొలి తెలుగు ప్రధాని పి.వి.నరసింహారావు జయంతి సందర్భంగా నాగోల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గవ్వ శ్యామ్ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అలకాపురి చౌరస్తాలోని పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నాయకులు సతీష్ యాదవ్, గుమ్మడి వెంకట్ రెడ్డి, శ్యామల యాదగిరి, రాంకోటి, నాగరాజు, లింగరాజు పాల్గొన్నారు.



అల్కాపురి చౌరస్తాలో బీఆర్ఎస్ నాగోలు డివిజన్ నాయకులు



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నెక్లెస్ రోడ్డులో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్



ఓల్డ్ మలక్‌పేటలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

లింగాల హనుమంతరావు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న వ్యాపారులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ట్రస్ట్ మాజీ చైర్మన్, గడ్డిఅన్నారం ట్రేడర్స్ అసోసియేషన్ ఫౌండర్ చైర్మన్ లింగాల హనుమంతరావు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వర్తక సంఘ నేతలు కొనియాడారు. లింగాల హనుమంతరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం గడ్డిఅన్నారం ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లింగాల సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షుడు తులసి శ్రీనివాస్ మాట్లాడుతూ... నిస్వార్థపరుడిగా పేరు తెచ్చుకున్న శ్రీనివాసరావు చేసిన సేవలు మర్చిపోలేనివన్నారు. సాయి బాబా ట్రస్ట్ చైర్మన్‌గా పనిచేసిన ఆయన ట్రేడర్స్ సమస్య పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. సాయి ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య, ట్రేడర్స్ అసోసియేషన్ అడ్వైజర్లు చంద్రధర్, సతీష్‌గోయల్, ప్రధాన కార్యదర్శి మార్గం రమేష్, జాయింట్ సెక్రటరి వి.శ్రీనివాసబాబు, కోశాధికారి శంకర్‌పటేల్, ఆర్గనైజింగ్ సెక్రటరి రాజేష్ లోయ, ఎం.డి.షరీఫ్, బాలరాజుగుప్తా పాల్గొన్నారు.

మాదన్నపేట బోనాల ఉత్సవ కమిటీ

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ మాదన్నపేట బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా తంగెళ్ల సుధీర్‌ను, వైస్ చైర్మన్‌గా జానపాల మధు (లల్లు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మాదన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా బోనాల జాతరను ఘనంగా నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీని ఆహ్వానిస్తామన్నారు.

దోమల నివారణతో వ్యాధులకు చెక్

నాగోలు: దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని.. దోమలను నివారిస్తే వ్యాధులను విజయవంతంగా అరికట్టవచ్చని నాగోలు డివిజన్ ఎంటమాలజీ సూపర్‌వైజర్ జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం దోమల నివారణ కోసం బండ్లగూడ చెరువు, మల్లికార్జుననగర్, అయ్యప్పనగర్ కాలనీలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు దోముల వ్యాప్తి చెందకుండా తీసుకోవాలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నీరు నిలువ లేకుండా చేసుకోవాలని తెలిపారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన షాహన్ షా

నాగోలు: డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణానికి గురయ్యాడు. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... ఉత్తరప్రదేశ్ రాంపూర్ జిల్లాకు చెందిన షాహన్ షా(22) అదే ప్రాంతాని చెందిన మహ్మద్ ఖలీం కలసి నగరానికి వచ్చి ఎల్‌బీనగర్ రాజీవ్‌గాంధీనగర్‌లో ఉంటున్నారు. ఎల్‌బీనగర్‌లో ఫాల్ సీలింగ్ పనులు చేసుకుంటున్నారు. మంగళవారం తుర్కయాంజల్‌లో ఫాల్ సీలింగ్ పనుల కోసం వెళ్లి తిరిగి రాత్రి తమ ద్విచక్ర వాహనంపై ఎల్‌బీనగర్ వైపు వస్తుండగా హస్తినాపురంలో మ్యాక్స్ షాపింగ్ మాల్ వద్ద రాగానే డీసీఎం (టీఎస్12 యుడీ 8869) వేగంగా వచ్చి ద్విచక్ర వాహనం వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో షాహన్ షా కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మహ్మద్ ఖలీంకు తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన వ్యక్తి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడిచేసి ఇద్దరిని గాయపరిచిన వ్యక్తి అరెస్టు

చైతన్యపురి: పెట్రోల్‌బంక్, ఓ బేకరీలో కత్తితో దాడిచేసి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిని చైతన్యపురి పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఏసీపీ, చైతన్యపురి ఎస్‌హెచ్ఓ మధుసూదన్ సమాచారం మేరకు... హరిపురి కాలనీకి చెందిన తండు శశికుమార్ (35) బుధవారం సాయంత్రం రిలయన్స్ పెట్రోల్ బంక్‌లోకి వెళ్లి అక్కడ పనిచేసే క్యాషియర్ బి.నరేష్‌ను డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. అతను డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో తన వద్ద ఉన్న కత్తితో అతని చేతిపై దాడిచేశాడు. అక్కడి నుంచి సమీపంలో ఉన్న అయ్యంగార్ బేకరీలోకి వెళ్లి అక్కడి సేల్స్‌మెన్ సునీల్‌కుమార్‌ను డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అతను కూడా డబ్బులు ఇవ్వకపోవడంతో అతనిపై చాకుతో దాడిచేశాడు. బంక్, షాపు వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడు శశికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ఒక స్కూటీ, ఒక చాకును స్వాధీనం చేసుకున్నారు. స్వల్పంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా నిందితుడు శశికుమార్‌కు కొంతకాలంగా మతి స్థిమితం సరిగా లేదని పోలీసుల విచారణలో తేలింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.